# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY
VALUME: 16 ISSUE:152

తెలుగు దినపత్రిక

నల్లగొండ సంపుటి: 16 సంచిక :170 ఎడిటర్ : సయ్యద్ పాష తేది: మంగళవారం 21-07-2026 పేజీలు:4 వెల: 1.00


## లంచగొండుల వివరాలు ఎసిబికి తెలపండి

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్:(040) 2475132, 247456,24745626

## దోమలగూడలో కలకలం..

హైదరాబాద్,హైదరాబాద్‌లోని దోమలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ముగ్గురు బాలికలు అదృశ్యమైన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన ఈ మైనర్లు.. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వైపు వెళ్లినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కుటుంబాలకు చెందిన స్నేహ, లలిత, లత అనే ముగ్గురు బాలికలు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లారు. బాలికలు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు దోమలగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు.సీసీటీవీ దృశ్యాల ఆధారంగా విచారణ: ఘటనా స్థల పరిసరాల్లోని సీసీటీవీ పుటేజీలను పరిశీలించగా.. బాలికలు మొదట హిమాయత్‌నగర్‌లో ఒక ఆటో ఎక్కినట్లు అధికారులు గుర్తించారు. అనంతరం ఆ ఆటో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ వద్దకు చేరుకోగా, బాలికలు అక్కడ దిగినట్లు సీసీటీవీ దృశ్యాల

# తెలంగాణ లో వైద్యం,ఆరోగ్యం పడకేసాయి...



హైదరాబాద్:బాన్సువాడ మాతా–శిశు ఆసుపత్రిలో శస్త్రచికిత్స అనంతరం తీవ్ర అస్వస్థతకు గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలింతలను, వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి హరీష్ రావు పరామర్శించాను. బాలింతల ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్యంపై నిమ్స్ డాక్టర్లను అడిగి తెలుసకున్నారు. అలాగే, ఖమ్మంలో జరిగిన దారుణ ఘటనలో తీవ్రంగా గాయపడి నిమ్స్ లోనే చికిత్స పొందుతున్న మైనర్ బాలికను కూడా పరామర్శించి, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.హరీష్ రావు మాట్లాడుతూ ...ఈ నెల 13వ తేదీన బాన్సువాడ ఆసుపత్రిలో డెలివరీకి వెళ్లిన 10 మంది మహిళలకు సిజేరియన్ ఆపరేషన్ చేసిన తర్వాత ఇన్ఫెక్షన్స్ సోకి పరిస్థితి విషమించింది. వారిని నిజామాబాద్ ఆసుపత్రికి, అక్కడి నుంచి నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నిమ్స్ లో ఫాతిమా, రుక్సానా, జ్యోతి, లక్ష్మీప్రియ, సునీత అనే ఐదుగురు బాలింతలు చికిత్స పొందుతున్నారు. ఈ ఐదుగురిలో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉంది. తెల్ల రక్త కణాలు తగ్గిపోవడం, ఊపిరితిత్తులు మరియు కిడ్నీలలో ఇన్ఫెక్షన్ కారణంగా వారు ఐసీయూలో డయాలసిస్ పైన ఉన్నారు. ఈ దారుణమైన సంఘటన జరిగి 10 రోజులు కావస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదు. ఏ ఒక్క మంత్రి, ఎమ్మెల్యే లేదా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారి వచ్చి బాధితులను పరామర్శించిన పాపాన పోలేదని అన్నారు.అసలు ఈ సంఘటన ఎందుకు జరిగింది? దీని వెనుక ఉన్న కారణాలు ఏంటి? అని తెలుసుకునే కనీస ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయలేదు. ఇప్పటివరకు పూర్తి స్థాయి విచారణకు కూడా ఆదేశించకపోవడం దారుణం. బాలింతలు పూర్తిగా కోలుకోకపోతే రేపు ఆ పసిపిల్లల్ని ఎలా చూసుకోవాలి.

# తెలంగాణలో ఎక్కువగా ఎల్‌నినో ప్రభావం: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



నల్గొండ: ఎల్‌నినో ప్రభావం తెలంగాణలో ఎక్కువగా ఉందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వరి వేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని.. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. నల్గొండ కలెక్టరేట్‌లో నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల అధికారులతో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ.. ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో నీళ్లు లేవని.. వర్షాలూ తక్కువేనన్నారు. వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపాలన్నారు. తక్కువ నీరు అవసరమయ్యే పంటలు వేసుకోవాలని.. దీనిపై రైతులకు దిశానిర్దేశం చేయాలని అధికారులకు సూచించారు. ఎల్‌నినో పరిస్థితులకు తగ్గట్టుగా ఉమ్మడి నల్గొండ జిల్లా సిద్ధం కావాలని చెప్పారు.

# పోచంపల్లి చేనేత సహకార సంఘం నూతన కమిటీ పదవీ బాధ్యతల స్వీకరణ..




యాదాద్రి కరెస్పాండంట్, జులై 20(.దేశ టైమ్స్ ). యాదాద్రి భువనగిరి జిల్లా,పోచంపల్లి పట్టణంలోని బాలాజీ గార్డెన్స్‌లో పోచంపల్లి చేనేత సహకార సంఘం నూతన కార్యవర్గ పదవీ బాధ్యతల స్వీకరణ మహోత్సవం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమానికి ముందు పట్టణ కేంద్రంలోని తెలంగాణ ఉద్యమ ప్రముఖుడు, పద్మశ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పోచంపల్లి చేనేత సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన భారత లవకుమార్ తో పాటు నూతన కార్యవర్గ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పోచంపల్లి చేనేతకు ప్రపంచవ్యాప్తంగా విశిష్టమైన గుర్తింపు ఉందని, ఈ ఖ్యాతిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం, చేనేత పరిశ్రమ అభివృద్ధి, మార్కెటింగ్ సౌకర్యాల విస్తరణకు కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పోచంపల్లి పట్టణ, మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, చేనేత కార్మికులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ సహకార సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీపై ప్రధాని మోదీ వ్యంగ్యాస్త్రాలు..



న్యూఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నేత, ఎంపీ రాహుల్ గాంధీపై ప్రధాని నరేంద్ర మోదీ పరోక్షంగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సమావేశాలకు ముందు పార్లమెంట్ భవనం వెలుపల ప్రసంగించిన మోదీ.. భారత్ తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్ విక్రమ్–1 విజయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా విజయానికి కారణమైన యువ శాస్త్రవేత్తలను ఆయన అభినందించారు. అదే సమయంలో ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు.హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ అంతరిక్ష సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన విక్రమ్–1 విజయవంతంగా కక్ష్యలోకి చేరడం దేశానికి గర్వకారణమని ప్రధాని మోదీ అన్నారు. ఈ ప్రాజెక్టుపై పని చేసిన బృందం సగటు వయస్సు కేవలం 28 సంవత్సరాలు మాత్రమేనని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తాను 56 ఏళ్ల యువకుడి గురించి మాట్లాడటం లేదంటూ రాహుల్ గాంధీపై పరోక్షంగా సెటైర్ వేశారు. ఇటీవల 56 ఏళ్లు పూర్తి చేసుకున్న రాహుల్ గాంధీని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడిగా ప్రచారం చేస్తుండటాన్ని ఉద్దేశించే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది.2014 లోక్‌సభ ఎన్నికల వేళ ప్రధాని మోదీది '56 అంగుళాల ఛాతీ' అంటూ పలువురు బీజేపీ నేతలు చెప్పారు. ఈ వ్యాఖ్యను కాంగ్రెస్ నేతలు అనేక సందర్భాల్లో విమర్శలకు ఉపయోగించారు.

# నీట్ నిరసనలపై లాఠీ దెబ్బలు.. మండిపడ్డ మల్లికార్జున ఖర్గే!



న్యూఢిల్లీ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన 'నీట్'పేపర్ లీకేజీ వివాదం చివరకు పార్లమెంట్ గడప తొక్కింది. వర్షాకాల సమావేశాల తొలిరోజే ఉభయ సభల్లోనూ విపక్షాలు ఈ అంశంపై ముప్పేట దాడికి దిగాయి. కేవలం 'నీట్' పేపర్ లీక్ మాత్రమే కాకుండా, అయోధ్య రామాలయ నిర్మాణ విరాళాల అక్రమాలు, నిరుద్యోగం వంటి కీలక అంశాలపై చర్చకు పట్టుబట్టాయి. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే ప్రతిపక్షాలు నినాదాలతో హోరెత్తించాయి.జంతర్ మంతర్ వద్ద ఉద్రిక్తత – 'సంసద్ చలో' మార్చ్ : ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద గత కొన్ని రోజులుగా కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో 'నీట్' పరీక్షల అవకతవకలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. విద్యార్థులు, యువత భారీ సంఖ్యలో తరలివచ్చి పార్లమెంటు దిశగా 'సంసద్ చలో' యాత్రకు పిలుపునిచ్చారు. పార్లమెంట్ పరిసర ప్రాంతాలలో భద్రతను కట్టుదిట్టం చేసిన పోలీసులు విద్యార్థులను అడ్డుకున్నారు. ఈ క్రమంలో తోపులాట జరిగి పోలీసులు లాఠీఛార్జ్ చేశారని, పలువురిని అక్రమంగా నిర్బంధించారని విపక్ష నేతలు ఆరోపించారు.సభలో ఖర్గే గర్జన – 'ప్రజాస్వామ్యంపై దాడే!' : ఈ నిరసనలపై రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే అత్యంత తీవ్రంగా స్పందించారు. "ఇది కేవలం కొద్దిమంది సమస్య కాదు, దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువత భవిష్యత్తుకు సంబంధించిన సున్నితమైన అంశం. ప్రశ్నించే గొంతుకలను నొక్కేయడమే ప్రజాస్వామ్యమా? జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీలతో దాడి చేయడం అత్యంత హేయమైన చర్య. ప్రభుత్వం మొండి వైఖరి వీడి వెంటనే విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి" అని ఖర్గే గట్టిగా డిమాండ్ చేశారు. సభలో చోటుచేసుకున్న ఈ గందరగోళ పరిస్థితుల కారణంగా ఉభయ సభలు మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా పడ్డాయి.ఢిల్లీ పోలీసుల వివరణ -- మరో కోణం : అయితే, విద్యార్థులపై లాఠీఛార్జ్ జరిగిందన్న ఆరోపణలను ఢిల్లీ పోలీసులు తీవ్రంగా ఖండించారు. జంతర్ మంతర్ వద్ద ఎలాంటి బలప్రయోగం లేదా అనుచిత చర్యలు జరగలేదని, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా తాము అత్యంత వృత్తిపరంగా వ్యవహరించామని ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చారు. నిషేధాజ్ఞలు ఉల్లంఘించి పార్లమెంట్ వైపు దూసుకురావడానికి ప్రయత్నించిన కొందరిని మాత్రమే అదుపులోకి తీసుకున్నట్లు స్పష్టం చేశారు.

# క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్లు...



హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ నగరంలోని నిరుపేదలకు గుడ్ న్యూస్ చెప్పింది. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన అల్పాదాయ వర్గాలకు సొంత ఇళ్లను నిర్మించి ఇవ్వాలని నిర్ణయించింది. సచివాలయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, అజారుద్దీన్ కలిసి ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. రాజధాని చుట్టూ ఉన్న కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో నివసించే ప్రతి పేద కుటుంబానికి ఇల్లు ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు సాకారం చేయడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని మంత్రులు స్పష్టం చేశారు. స్థలం లేని వారికి కూడా ఇళ్లను నిర్మించి ఇచ్చేలా ఈ పథకాన్ని రూపొందించారు.

525 చదరపు అడుగుల్లో ఆధునిక హంగులతో ఇళ్ల నిర్మాణం

ఈ పథకం కింద నిర్మించే ఇళ్లపై మంత్రులు స్పష్టమైన ప్రకటన చేశారు. భూమి ధరలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో కూడా పేదల కోసం ప్రత్యేకంగా హౌసింగ్ బోర్డు టవర్లను నిర్మిస్తున్నారు. ప్రతి ఫ్లాట్ సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంలో అందుబాటులోకి వస్తుంది. తొలి దశలో భాగంగా 16 నియోజకవర్గాల్లో ఒక్కో చోట 500 చొప్పున ఇళ్లను నిర్మిస్తారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి ప్రాంతాల్లో లక్ష ఫ్లాట్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వ భూములను సద్వినియోగం చేస్తూ పేదలు నివసించే ప్రాంతాలకు దగ్గరలోనే ఈ గృహాలను అందుబాటులోకి తెస్తున్నారు. నాణ్యతతో కూడిన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.క్యూర్ పరిధిలో ఇళ్లు లేని అల్పాదాయ వర్గాల ప్రజలు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తుల ప్రక్రియ, అర్హతలకు సంబంధించిన పూర్తి విధివిధానాలను ప్రభుత్వం త్వరలో వెల్లడించనుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సొంత స్థలం ఉన్నవారికి 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని మంత్రులు తెలిపారు. ఆగస్టు నెలాఖరు వరకు సుమారు 2 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తవుతుందని వెల్లడించారు. ప్రభుత్వం చేపట్టిన ఈ భారీ గృహ నిర్మాణ కార్యక్రమం ద్వారా వేలాది మంది పేదలకు సొంతింటి కల నెరవేరనుంది. అర్హులైన వారు నిబంధనలను అనుసరించి దరఖాస్తు చేసుకొని ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

# గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం..



ఖమ్మం జిల్లా: కొనిజర్ల మండలం అంజనాపురంలో నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో గోద్రెజ్ కంపెనీ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషంగా ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కాంప్లెక్స్‌లో అత్యాధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేశారని తెలిపారు. గోద్రెజ్ కంపెనీకి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని, రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండేలా కంపెనీ సేవలందించాలని ఆకాంక్షించారు.ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు కృషి జరుగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా రైతులంతా ఈ పంట సాగుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్‌తో ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఆయిల్ పామ్ కింద ఇప్పటికే మూడు ఫ్యాక్టరీల నిర్మాణం పూర్తయిందని, మరో ఆరు ఫ్యాక్టరీల నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. తెలంగాణ భూములు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని మంత్రి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీల నిర్మాణం జరగాలన్నదే తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. దక్షిణ భారతదేశ నేతలందరూ ఆయిల్ పామ్ దిగుమతిపై సుంకం తగ్గించాలని కోరుతున్నామని మంత్రి చెప్పారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఆయిల్ పామ్ సాగుతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు మంత్రి తుమ్మల. తన యాభై సంవత్సరాల వ్యవసాయ అనుభవంలో ఎన్నో పంటలు పండించామని, ఏ పంటకు రాని ఆదాయం దీనికి వస్తుందన్నారు. ఆయిల్ పామ్‌ను ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన నాటి నుంచి తాను కూడా సాగు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు, ఎల్‌నినో ప్రపంచాన్ని కబళించే పరిస్థితి ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. దాని కారణంగా రుతుపవనాలు సరిగా రాలేదని, మానవజాతి చేసిన విధ్వంసం తిరిగి మన పాలిటే మహమ్మారిగా మారిందన్నారు. దక్షిణ భారతదేశంలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని, ఉద్యానవన పంటల సాగుతో భూములను చల్లబరచాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

# సంతోషాన్ని వెతుక్కుంటున్నాను.. మంత్రి కొండా సురేఖ ఆసక్తికర వ్యాఖ్యలు



హైదరాబాద్,ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువ కావాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిర్వహించిన "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. నేరుగా ఫోన్ కాల్‌లో మంత్రి కొండా సురేఖ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంతో పాటు, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కాల్స్‌లో రెవెన్యూ, భూ సమస్యలు, తాగునీరు, రహదారులు, టాయిలెట్లు, డ్రైనేజీ, విద్యుత్, సంక్షేమ పథకాల అమలు, ఇందిరమ్మ ఇండ్లు, శ్మశానవాటికల ఏర్పాటు, మౌలిక సదుపాయలు, పెన్షన్లు తదితర అంశాలపై ప్రజలు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి వినతిని ఓపికగా విన్న మంత్రి, సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి, వారి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని వారికి భరోసా ఇచ్చారు. పలు సమస్యల పై వెంటనే వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద, జీడబ్ల్యుఎంసీ కమిషనర్ వెంకన్నతో పాటు పలువురు ఇతర అధికారులతో మాట్లాడి ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల పరిష్కరానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రతి వ్యక్తికీ న్యాయం జరుగుతుంది..ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ "ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా ప్రజలు నన్ను గుర్తిస్తారు. ప్రజలు నాపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు ప్రతి వినతిని నా సమస్యగా భావించి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నాను. ప్రజా ప్రభుత్వంలో ప్రతి వ్యక్తికి న్యాయం జరుగుతుంది" అని పేర్కొన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోనూ తాను, తన భర్త, మాజీ ఎమ్మెల్సీ మురళీధర్ రావు ప్రజల నుంచి వినతులు, దరఖాస్తులు స్వీకరిస్తూ, సంబంధిత అధికారులతో అప్పటికప్పుడు మాట్లాడి సాధ్యమైనంత వేగంగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. అంతేకాకుండా, హైదరాబాద్ సచివాలయంలోని తన కార్యాలయంలోనూ, జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలోనూ, బంజారాహిల్సల్ లోని క్యాంపు కార్యాలయంలోనూ ప్రజలు, అవసరార్థులు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు, దరఖాస్తులు స్వీకరించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేస్తూ పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తున్నట్లు మంత్రి వివరించారు."పదవులతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజాసేవలోనే తృప్తిని వెతుక్కుంటున్నాను. ప్రజల సమస్యలు పరిష్కారమై వారి ముఖాల్లో చిరునవ్వు చూడటమే నాకు నిజమైన సంతృప్తి. ప్రజలకు అందుబాటులో ఉండటం నా బాధ్యతగా, వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం నా కర్తవ్యంగా భావిస్తున్నాను" అని మంత్రి సురేఖ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో వుంటుందని, ప్రజల సమస్యల పరిష్కారానికే తమ తొలి ప్రాధాన్యమని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు జవాబుదారీతనంతో కూడిన, పారదర్శకమైన, ప్రజా కేంద్రిత పాలన అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సురేఖ స్పష్టం చేశారు.

# పొత్తులకు వైసీపీ ప్రయత్నాలు...



విజయవాడ, జగన్ వచ్చే ఎన్నికల్లో పొత్తుకు సిద్ధమవుతున్నారా? అంటే రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చు. ఎప్పుడూ దేనినీ తోసిపుచ్చలేం. ప్రచారమని ఇప్పుడు అనుకున్నా.. బలమైన ప్రత్యర్థిని మట్టికరిపించాలంటే తన బలగాన్ని కూడా పెంచుకోవాల్సి ఉంటుంది. అదే యుద్ధనీతి. రీతి కూడా. ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ఇంకా మూడేళ్ల సమయం ఉంది. అయితే కూటమి పాలనపై వామపక్ష పార్టీలు విమర్శలు చేస్తున్నాయి. చంద్రబాబు పాలనపై విరుచుకుపడుతున్నాయి. అలాగే ప్రతి సమస్యపై పోరాడుతున్నాయి. మరొకవైపు కూటమి లో జరుగుతున్న ప్రతి ఘటనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఎర్రదండు కార్యక్రమాలను రూపొందించుకుంది కూటమిలో బీజేపీ ఉండటంతో సహజంగానే వామపక్షాలు జగన్ కు చేరువవుతాయంటున్నారు. అలాగని జగన్ కూడా బీజేపీకి దూరం కాదు. కానీ ప్రత్యక్షంగా పొత్తు లేదు కాబట్టి వైసీపీతో కలసి నడవటానికి ఎర్రన్నలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సీపీఐ నేత రామకృష్ణ ఇటీవల కాలంలో పదే పదే విమర్శలు చేయడం, సీపీఐ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య సయితం ప్రతి అంశంపై ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్పందించడం ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. అలాగేఇక సీపీఎం తొలి నుంచి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగానే గళం విప్పుతూనే ఉంది. ఈ రెండు పార్టీలతో కలసి జగన్ వెళతారన్న ప్రచారం జరుగుతుంది. ఇప్పటి వరకూ జగన్ ఒంటరిగానే పోటీ చేస్తూ వచ్చారు. వామపక్షాలు మాత్రం ఒకసారి పవన్ తో కలసి పోటీ చేసి ఒక్క స్థానాన్ని కూడా దక్కించుకోలేదు. ఆ మాట కొస్తే రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ శాసనసభలో వామపక్షాలకు ఇప్పటి వరకూ ప్రాతినిధ్యం లేదు. అయితే జగన్ కు తన బలం, బలగంపై అపార నమ్మకం ఉంది. ఒంటరిగానే పోటీ చేయాలన్న తపన ఉంది. కానీ కూటమిని ఎదుర్కొనాలంటే ఓటు బ్యాంకు లేకపోయినా గట్టి వాయిస్ ఉన్న వామపక్ష పార్టీలు తోడుగా నిలిస్తే కొంత రాజకీయంగా ఉపయోగం ఉంటుందని జగన్ భావిస్తున్నట్లు తెలిసింది. అయితే దీనిపై ఇంకా క్లారిటీ లేకపోయినా వామపక్షాలతో జగన్ పొత్తు పెట్టుకునే అవకాశాలు మాత్రం కొట్టిపారేయలేం.వైసీపీ గత ఎన్నికల్లో చిత్తుగా ఓడిపోయింది. 151 స్థానాల నుంచి 11కు పడిపోయింది. దీనికి కారణాలు ఏంటన్నవి అందరికీ తెలిసినా.. వైసీపీకి మాత్రం ఇంకా బోధపడలేదు. దీంతో ఇటు పార్టీలోను, అటు నాయకుల్లోనూ మార్పు కనిపించడం లేదన్న వాదన ఉంది. వాస్తవానికి ప్రజాస్వామ్యంలో గెలుపు ఓటములు కామనే అయినా.. కారణాలు తెలుసుకుని ముందుకు సాగాల్సిన అవసరం పార్టీలపై ఉంటుంది. వాటిని సరిదిద్దుకునే ప్రయత్నం చేయాలి.ప్రస్తుత ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత లేదా పుట్టబోయే వ్యతిరేకత తమకు మేలు చేస్తుందని వైసీపీ నాయకులు అంచనా వేసుకుంటు న్నారు. వాస్తవానికి ఇది పార్టీ అధిష్టానంలోనే ఉంది. అందుకే క్షేత్రస్థాయి నాయకులు కూడా అదే దారిలో నడుస్తున్నారు. దీంతో వైసీపీలో సరైన దిశానిర్దేశం లేకుండానే నాయకులు ముందుకు సాగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఫలితంగా పార్టీ పుంజుకునే విషయంలో ఇంకా వెనుక బడే ఉందన్నది వాస్తవం.ముఖ్యంగా నియోజకవర్గాల స్థాయిలో పార్టీకి భారీ ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే వైఖరి పార్టీకి కలిసి రాకపోగా.. వివాదాలకు కేంద్రంగా మారుతోంది. దీనిని సరిచేయాల్సి పార్టీ అధిష్టానం కూడా మౌనంగానే ఉండడం గమనార్హం. అంతా నేతలే చూసుకుంటారులే అనే ధోరణి అవలంభించడంతో పరిస్థితి ఇబ్బందిగానే ఉందన్నది పార్టీకి తెలిసినా.. నాయకులకు ఎలాంటి దిశానిర్దేశం చేయడం లేదు. ప్రస్తుతం ఉత్తరాంధ్రలో కేవలం నలుగురైదుగురు నాయకులు మాత్రమే యాక్టివ్‌గా ఉన్నారు.సీమలో కూడా కేవలం ఇద్దరు ముగ్గురు నేతలు మాత్రమే వాయిస్ వినిపిస్తున్నారు. ఇక, ఉభయ గోదావరి, ఉమ్మడి కృష్ణాలో ఒకరిద్దరు కూడా తక్కువగానే ఉన్నారు. గుంటూరులో అయితే.. అంబటి రాంబాబు కేంద్రంగానే వైసీపీ రాజకీయా లు సాగుతున్నాయి. ఇలా.. చేయడం వల్ల పార్టీపరంగా వచ్చే ఇమేజ్ మాట ఎలా ఉన్నా.. పోతున్న ఇమేజే ఎక్కువగా ఉంది. దీంతో రాజకీయంగా వైసీపీ పుంజుకోవడం కూడా కష్టమేనన్న భావన వ్యక్తమవుతోంది. మొత్తంగా ఈ రెండేళ్లలో పార్టీ పెద్దగా పుంజుకున్నది అయితే లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఆగస్టు 1న భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభం

విజయనగరం,విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మాణ పనులను పూర్తి చేసుకున్న అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఇటీవల ఎయిర్ పోర్ట్ నిర్మాణ చివరి దశ పనులు సైతం పూర్తయ్యాయి. ఆగస్టు 1వ తేదీన ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం జరగనున్నట్టు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం నాడు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఆనందం వ్యక్తం చేశారు. ఆగస్టు ఒకటో తేదీ.. ఉత్తరాంధ్ర.. ఉత్తమాంధ్రగా నిలిచేందుకు ముహూర్తం ఆసన్నమైందని పేర్కొన్నారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ఓ ఒక అద్భుతమైన ఘట్టం ఆవిష్కృతం అవుతున్న సమయంలో.. ఆంధ్ర రాష్ట్ర ప్రజలంతా తమ మద్దతును అందివ్వాలని రామ్మోహన్ నాయుడు కోరారు. ప్రధాని మోదీ పర్యటనకు సంబంధించి పూర్తి షెడ్యూల్, వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని కేంద్ర మంత్రి చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆగస్టు 1వ తేదీన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ చారిత్రాత్మక ప్రారంభోత్సవ వేడుక చరిత్రలో నిలిచిపోయేలా అత్యంత ఘనంగా జరిగేలా చూడాలని అధికారులను ఆయన ఆదేశించారు. అల్లూరి సీతారామరాజు ఎయిర్ పోర్ట్ పనుల పురోగతి, ప్రారంభోత్సవ ఏర్పాట్లపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఒక మణిహారం లాంటిది. ఇది ఈ ప్రాంతానికి సరికొత్త ఆర్థిక, పారిశ్రామిక అవకాశాలను తీసుకువస్తుంది. భోగాపురం విమానాశ్రయం, పర్యాటక ప్రాజెక్టులు, పోర్టులు, జాతీయ రహదారులు, పరిశ్రమల అనుసంధానంతో ఉత్తరాంధ్ర ఇకపై అన్‌స్టాపబుల్ గా దూసుకుపోతుందని దీమా వ్యక్తం చేశారు. ఈ ఎయిర్ పోర్ట్ లోని ప్రతి విభాగం ఏపీ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దాలని అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

ఉత్తరాంధ్ర ఇక అన్ స్టాపబుల్

తెలుగుదేశం ప్రభుత్వంలో మొదలైన భోగాపురం ఎయిర్ పోర్టు పనులను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసి?రెండేళ్ల కాలంలో పూర్తి చేసిందని చంద్రబాబు చెప్పారు. సర్వాంగ సుందరంగా తయారైన భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభ



కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోందని, ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా భోగాపురం ఎయిర్ పోర్టులో నిర్మాణ వివరాలు, వసతులు, సౌకర్యాలను అధికారులు సీఎం చంద్రబాబుకు వివరించారు. ఎయిర్ పోర్టు కార్యకలాపాలు ప్రారంభించడానికి అవసరమైన 8 కీలక అనుమతులు ఇప్పటికే పొందినట్లు తెలిపారు.ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ?"ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్ పోర్టు కీలకం కానుంది. సామాన్యుల జీవితాలను మార్చే విధంగా ఎయిర్ పోర్టు ఉత్తరాంధ్రలో కొత్త అవకాశాలను తీసుకువస్తుంది. ఎకనమిక్ యాక్టివిటీ ఉరుకులు పెడుతుంది. రాకపోకలు మొదలయ్యాక ఆ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మారుతాయి. సామాన్యులు కూడా అనేక రకాలుగా లబ్ది పొందుతారు. విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో ఈ ఎయిర్ పోర్టు కీలక పాత్ర పోషిస్తుంది. హైదరాబాద్‌లో వచ్చిన శంషాబాద్ ఇంటర్ నేషనల్ ఎయిర్‌పోర్టు ఆ ప్రాంతంలో ఎటువంటి మార్పులు తెచ్చిందో నేడు భోగాపురంతో ఆ ప్రాంతంలోనూ అటువంటి మార్పులే తెస్తుంది." అని అన్నారు."ఆంధ్రప్రదేశ్ సంస్కృతి, కళలను చాటేలా అత్యంత కళాత్మకంగా ఎయిర్ పోర్టులో ప్రతి విభాగాన్ని తీర్చిదిద్దాలి. ప్రధాని చేతుల మీదు జరిగే ప్రారంభోత్సవం చరిత్రలో నిలిచిపోవాలి. గిరిజన సంస్కృతి, హస్తకళలు గుర్తు చేసేలా స్వాగత కార్యక్రమం ఉండాలి. భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభాన్ని ఉత్తరాంధ్రలోని ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడు సెలబ్రేట్ చేసుకోవాల్సిన శుభ

# బీజేపీ గాలి తీసేలా రాజా సింగ్ షాకింగ్ కామెంట్స్ !



హైదరాబాద్,బీజేపీకి ఆయన బద్ధుడైన నాయకుడే. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలవడం అంటే ఆషామాషీ వ్యవహారం కానే కాదు. కానీ గెలిచి చూపించిన రాజకీయ మొనగాడు రాజాసింగ్. గోషామహల్ ఎమ్మెల్యేగా 2014 నుంచి వరుసగా బీజేపీ గుర్తుతో గెలిచి వస్తున్న రాజా సింగ్ ని పార్టీ 2023 ఎన్నికల తరువాత సస్పెండ్ చేసింది. ఆయన కొన్ని విషయాల్లో సొంత పార్టీ మీదనే విమర్శలు చస్తున్నారు అన్న కారణంతో పక్కన పెట్టారు. అయితే ఏదో నాటికి ఆయన బీజేపీ గూటికి చేరుతారు అన్న ప్రచారం ఒక వైపు ఉండగానే రాజా సింగ్ ఏ మాత్రం తగ్గడం లేదు. తన అభిప్రాయాలను ఆయన కుండబద్దలు కొడుతున్నారు. ఆయన బీజేపీకి నిర్మాణాత్మకమైన సూచనలు ఇస్తున్నట్లుగానే అవి ఉంటున్నా అదే సమయంలో ఘాటైన విమర్శలుగా కూడా కనిపిస్తున్నాయి.

బీజేపీ అధికారంలోకి వస్తుందా :

బీజేపీ తెలంగాణాలో అధికారంలోకి వస్తుందా అని రాజా సింగ్ ప్రశ్నించారు. ఆ ఇద్దరు నేతలు కలిస్తే ఏమి జరుగుతుందని ఆయన కీలక ప్రశ్నను సంధించారు. ఆ ఇద్దరు నేతలు ఎవరో కాదు కేంద్ర మంత్రి బండి సంజయ్ అలాగే మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్. ఈ ఇద్దరు నాయకులను తెలంగాణా బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి అభయ్ సింగ్ పిలిపించి చేతులు కలిపారు. విభేదాలు మరచి కలసికట్టుగా పనిచేయాలని సూచించారు. దీంతో బీజేపీ తెలంగాణాలో తన వ్యూహాత్మకమైన అడుగులతో ముందుకు సాగుతోంది అన్న సంకేతాన్ని ఇచ్చినట్లు అయింది. ఇపుడు దానిని రాజా సింగ్ తప్పు పడుతున్నారు. ఇద్దరు నేతలు చేతులు కలిపితే బీజేపీ అధికారంలోకి వస్తుందా అని ఆయన నిలదీస్తున్నారు.

వారి సంగతేంటి :

బీజేపీలో ఎంతో మంది సీనియర్ నాయకులు అలాగే కార్యకర్తలు ఉన్నారని ఆయన గుర్తు చేశారు. వారి సంగతి ఏమిటి అని కూడా ప్రశ్నించారు. అంటే పార్టీలో నాయకులందరినీ బీజేపీ ఇంకా కలుపుకొని పోవడం లేదన్న విమర్శ ఆయన మాటలలో కనిపిస్తోంది. అదే సమయంలో కార్యకర్తలకు ఉత్సాహం కలిగించేలా యాక్షన్ ప్లాన్ లేదని కూడా ఆయన చెబుతున్నట్లుగా ఉంది. నిజానికి బీజేపీలో ఇద్దరు కీలక నేతలు షేక్ హ్యాండ్స్ ఇచ్చుకున్నారు. విభేదాలు తగ్గాయి. ఇది మంచి సంకేతాలను ఇస్తుందని కమలనాధులు ఒక వైపు పొంగుతున్నారు. దాని మీద రాజా సింగ్ తన ఘాటు విమర్శలతో నీళ్ళు జల్లేశరు అని అంటున్నారు.

ఆ ఒక్కటీ చేసి చూపించండి :

కమలం పార్టీ తెలంగాణాలో కదనోత్సాహంతో ఉంది. మూడు కార్పోరేషన్ల మేయర్ పదవులు గెలుచుకోవాలని పట్టుదలగా ఉంది. అలా తన సత్తా చాటాలని చూస్తోంది. అయితే బీజేపీ ఉత్సాహానికి గాలి తీసేశారు రాజాసింగ్ అంటున్నారు. మూడు కార్పోరేషన్ల మేయర్లు గెలవడం కాదు ముందు ఒక్క కార్పోరేషన్ లో అయినా సగం సీట్లు గెలిచి చూపించండి చాలు అని సవాల్ చేసేలా మాట్లాడారు. అంటే బీజేపీకి ఒక్క కార్పొరేషన్ గెలిచే అవకాశాలు లేవని రాజా సింగ్ తన ముందస్తు అంచనాను ఇలా బయటపెట్టారా అని చర్చ సాగుతోంది. అంతే కాదు ఆయన బీజేపీ ప్రస్తుత అధ్యక్షుడు రామచంద్రరావు మీద మీద కూడా కామెంట్స్ చేశారు. ఆయన చేతులు కట్టేశారని మరి ఎలా పనిచేస్తారు అని ప్రశ్నించారు ఒక వ్యక్తి కోసమే అధినాయకత్వం ఆలోచించే విధానాలు వద్దు అని హితవు పలికారు. మొత్తానికి దూరంగా ఉంటూనే కమలానికి కఠినమైన తీరులోనే సలహాలు సూచనలతో పాటు దిశా నిర్దేశం చేశారు రాజాసింగ్. దీనిని బీజేపీ అధినాయకత్వం ఏ విధంగా చూస్తుంది అన్నదే ఇపుడు చర్చ మరి.

# షర్మిల భవితవ్యం...కాంగ్రెస్ నిర్ణయం ?

అమరావతి,ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పీసీసీ చీఫ్ గా గత రెండున్నరేళ్లుగా కొనసాగుతున్నారు. ఆమె 2024 జనవరి మూడవ వారంలో ఈ పదవిని అందుకున్నారు. ఆ తరువాత వచ్చిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గ్రాఫ్ ని పెంచకపోయినా కాంగ్రెస్ ఓటు బ్యాంక్ ని చీల్చి సొంత పార్టీ పెట్టుకుని దెబ్బ తీసిన వైసీపీని గద్దె దించడంతో మాత్రం ఆమె నాయకత్వం సక్సెస్ అయింది. అదే సమయంలో వైసీపీకి అసెంబ్లీలో ప్రతిపక్ష స్థానం కూడా దక్కకుండా చేయడంలో షర్మిల పాత్ర రాయలసీమ జిల్లాలలో ముఖ్యంగా సాగింది. మొత్తానికి షర్మిల పీసీసీ చీఫ్ గా సాధించింది చూస్తే ఇదంతా విశ్లేషించాలి. ఆ మీదట గడచిన రెండేళ్ళుగా కూటమి ప్రభుత్వం మీద షర్మిల పోరాటం అయితే పెద్దగా లేదని విమర్శలు వచ్చాయి.

వైసీపీనే టార్గెట్ :

ఏపీలో వైసీపీని టార్గెట్ చేస్తూనే షర్మిల తన రాజకీయం అంతా చేస్తూ వచ్చారు అన్న విమర్శలను మూటగట్టుకున్నారు. పైపెచ్చు కాంగ్రెస్ ఎక్కడా ఎత్తిగిల్లలేకపోయిని అని ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు గుర్తించారు అని అంటున్నారు. ఏపీలో వైసీపీ గద్దె దిగిపోతే అందులో నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నేతలు అంతా కాంగ్రెస్ లో చేరుతారు అని కాంగ్రెస్ ఓటు బ్యాంక్ తిరిగి వెనక్కి వస్తుందని వేసుకున్న అంచనాలు కూడా తల్లకిందులు అయ్యాయని అంటున్నారు. వైసీపీ తన బలాన్ని అలాగే ఉంచుకుంది. ఈ రోజుకీ ప్రధాన ప్రతిపక్షంగా నిలిచి పోరాటం చేస్తోంది అని అంటున్నారు.

మౌనంగానే ఉంటూ :

ఈ క్రమంలో గత కొంతకాలంగా చూస్తే షర్మిల మౌనంగా ఉంటూ వస్తున్నారు. దానికి కారణాలు చూస్తే ఆమెకు రాజ్యసభ సీటు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పెద్దలు మాట తప్పారు అన్న ఆగ్రహం ఆమెలో ఉందని అంటున్నారు. కర్ణాటక నుంచి ఇటీవల నాలుగు రాజ్యసభ సీట్లు ఖాళీ అయితే అందులో ఒకటి షర్మిలకే అనుకున్నారు. ఆ మేరకు దాదాపుగా ఖరారు అయిందని కూడా పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. కానీ చివరికి చూస్తే ఆమె పేరు లేకుండా జాబితా




వెలువడింది. దాంతో షర్మిల అయితే తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అంటున్నారు. దాంతో ఆమె సైలెంట్ మోడ్ లో ఉన్నారని కూడా చెబుతున్నారు.

ఇది కూడా కారణమా :

ఇంకో వైపు చూస్తే ఏపీసీసీకి కొత్త నేతను తీసుకుని వస్తున్నారు అని అంటున్నారు. ఆ దిశగా కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది అని అంటున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు పూర్తి కావడంతోనే ఏపీ మీద కాంగ్రెస్ జాతీయ నాయకత్వం ఫోకస్ పెడుతుందని అంటున్నారు. రానున్న మూడేళ్ళలో ఏపీలో అసెంబ్లీకి అలాగే లోక్ సభకు ఎన్నికలు ఉన్నందువల్ల ఇప్పటి నుంచే నాయకత్వాన్ని సరిచేసి లైన్ లో పెట్టాలని కాంగ్రెస్ అగ్ర నేతలు నిర్ణయించారు అని అంటున్నారు. ఇక షర్మిలకు ఎక్కడ పదవి ఇస్తారు అన్న చర్చ కూడా ఉంది. ఆమెని జాతీయ స్థాయిలోకి తీసుకుని పదవి ఇస్తారు అని కూడా ప్రచారం సాగుతోంది. ఈ పరిణామాల క్రమంలోనే షర్మిల పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్లుగా ఊహాగానాలు అయితే వినిపిస్తున్నాయి. మొత్తం మీద చూస్తే షర్మిల ఏపీ రాజకీయాలకు దూరం అవుతారా అంటే జవాబు తెలియడానికి మరి కొద్ది నెలలు వేచి చూడాల్సి ఉంది అని అంటున్నారు.

# అధిష్టానం ఎంట్రీతో ఈటెల,బండి మధ్య గ్యాప్ తగ్గినట్టేనా



హైదరాబాద్, జూలై 20,తెలంగాణ భారతీయ జనతా పార్టీలో గత కొంతకాలంగా సాగుతున్న అంతర్గత విభేదాలకు చెక్ పెట్టేందుకు అధిష్టానం ప్రయత్నాలు షురూ చేసింది. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పెట్టుకున్న ఢిల్లీ పెద్దలు, ఇక్కడి కీలక నేతల మధ్య ఉన్న కోల్డ్ వార్‌ను ముగించడానికి నేరుగా రంగంలోకి దిగారు. ఇందులో భాగంగానే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, ఎమ్మెల్యే అభయ్ పాటిల్ ఆధ్వర్యంలో బుజ్జగింపుల పర్వం ఊపందుకుంది. రాష్ట్ర బీజేపీలో అత్యంత కీలక నేతలుగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చేందుకు హైకమాండ్ గట్టి ప్రయత్నాలే చేస్తోందిఈ వివాదాన్ని వీలైనంత త్వరగా సమసిపోయేలా చూడాలనే పట్టుదలతో అధిష్టానం ఉంది. ఇందులో భాగంగానే శుక్రవారం రాత్రి ఈటల రాజేందర్ నివాసానికి వెళ్లిన అభయ్ పాటిల్, రాత్రి పొద్దుపోయే వరకు ఆయనతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. పార్టీ అంతర్గత పరిణామాలు, విభేదాలకు గల కారణాలపై ఆయనతో ఆరా తీశారు. అనంతరం బండి సంజయ్‌తో కూడా అభయ్ పాటిల్ భేటీ అయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది.ఈ క్రమంలోనే ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ నివాసంలో ఒక కీలకమైన భేటీ జరగనుంది. ఈ మీటింగ్‌కు ఈటల రాజేందర్, బండి సంజయ్ ఇద్దరూ హాజరుకానుండటం విశేషం. అధిష్టానం దూతలుగా వచ్చిన సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ సమక్షంలో ఈ ఇద్దరు నేతలను ఒకే వేదికపైకి తెచ్చి, వారి మధ్య ఉన్న మనస్పర్థలను తొలగించడానికి లక్ష్మణ్ నివాసం వేదిక కాబోతోంది.కొంతకాలంగా ఈటల రాజేందర్, బండి సంజయ్ మధ్య సఖ్యత లోపించిన విషయం బహిరంగ రహస్యమే. ఒకరిపై మరొకరు పరోక్షంగా పలుమార్లు విమర్శలు, ఆరోపణలు గుప్పించుకున్నారు. ఈ ఇద్దరు నేతల మధ్య ఉన్న గ్యాప్ చూసి వారి అనుచరులు, అభిమానులు మరింత రెచ్చిపోయారు. పలు సందర్భాల్లో పరస్పర వ్యతిరేక పోస్టర్లు, ఫ్లెక్సీలు కూడా వెలిశాయి. ఈ అంతర్గత విభేదాలు క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను తీవ్ర గందరగోళానికి గురిచేశాయి. ఈ ప్రభావం పార్టీ బలోపేతంపై పడుతుండటంతో ఢిల్లీ పెద్దలు అలర్ట్ అయ్యారు.ఇటీవల తెలంగాణలో పర్యటించిన జాతీయ నేతలు నితిన్ నబీన్, జేపీ నడ్డా సైతం రాష్ట్ర నేతలకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి, పార్టీ ప్రయోజనాలే పరమావధిగా పనిచేయాలని కరాఖండిగా చెప్పారు. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో మార్పు రాకపోవడంతో, ఇప్పుడు నేరుగా హైకమాండ్ రాయబారాన్ని పంపింది.తెలంగాణలో అధికారమే పరమావధిగా భావిస్తున్న బీజేపీకి ఈ ఇద్దరు నేతలూ అత్యంత అవసరం. బండి సంజయ్ మాస్ లీడర్‌షిప్, కేడర్‌లో ఉన్న ఫాలోయింగ్ పార్టీకి ఎంత ప్లస్సో.. ఈటల రాజేందర్ రాజకీయ అనుభవం, వ్యూహాలు అంతే ముఖ్యం. వీరిలో ఏ ఒక్కరిని వదులుకోవడానికి లేదా దూరం పెట్టడానికి అధిష్టానం సిద్ధంగా లేదు. ఇద్దరి బలాలు కలిస్తేనే తెలంగాణలో అనుకున్న లక్ష్యాన్ని సాధించగలమని ఢిల్లీ పెద్దలు బలంగా నమ్ముతున్నారు.అధిష్టానం నేరుగా రంగంలోకి దిగడం, ఇవాళ ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు కీలక నేతలు ముఖాముఖి కూర్చోనుండటంతో ఈ భేటీపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ చర్చల తర్వాతైనా ఇద్దరు నేతలు తమ పంతాలను వీడి, పార్టీ కోసం కలిసి నడుస్తారని సాధారణ కార్యకర్తలు, క్యాడర్ ఆశగా ఎదురుచూస్తున్నారు. మరి ఢిల్లీ పెద్దల బుజ్జగింపులు ఎంతవరకు పారుతాయో, టీ బీజేపీలో ఈ అంతర్గత సంక్షోభానికి తెరపడుతుందో లేదో చూడాలి.

# చామకూర దారెటు...

హైదరాబాద్, తెలుగు నేల రాజకీయాల్లో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వ్యవహారం ఎప్పటికప్పుడు హాట్ కేక్ మాదిరిగానే ఉంటోంది. ఏ పార్టీలో ఉన్నా తనదైన మార్కు రాజకీయం, తనదైన మార్కు వ్యవహారంతో మల్లారెడ్డి నిత్యం వార్తల్లోనే ఉంటారు. ప్రస్తుతం బీఆర్ఎస్ లో కొనసాగుతున్న మల్లారెడ్డి? ఆ పార్టీని వీడతారంటూ చాన్నాళ్లుగా వార్తలు వినిపిస్తూనే ఉన్నాయి. అయితే ఎప్పటికప్పుడు ఆ వాదనలను కొట్టిపారేస్తున్న సీనియర్ నేత? మళ్లీ అవే వార్తలకు బలం చేకూర్చేలా వ్యవహారం నడుపుతూ నిజంగానే వార్తల్లో నేతగా నిలుస్తున్నారు. తాజాగా మల్లారెడ్డికి చెందిన ఓ వీడియో తెగ వైరల్ అవుతోంది. ఈ వీడియోను చూస్తుంటే? ఇక మల్లారెడ్డి బీఆర్ఎస్ కు వీడ్కోలు పలికినట్టేనన్న వాదనలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.తెలంగాణ రాజకీయాల్లో అత్యంత చర్చనీయాంశంగా మారిన ఈ వీడియోలో మల్లారెడ్డి అసలు నోరు మెదపనే లేదు. ఈ వీడియోలో కాంగ్రెస్ పార్టీ కీలక నేత, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్నారు. తన ప్రసంగంలో ఆయన బీఆర్ఎస్ అదినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావుపై ఓ రేంజిలో విమర్శలు గుప్పిస్తున్నారు. కేసీఆర్ పై ఆ రేంజిలో రేవంత్ విమర్శలు గుప్పిస్తూ ఉంటే?ఆయనకు వెనుక?ఆయనకు దాదాపుగా ఆనుకుని కూర్చుని ఉన్న మల్లారెడ్డి? తన ముఖంలో ఏ భావమూ కనిపించనీయకుండా అలా కూర్చుండి కనిపిస్తున్నారు..కేసీఆర్ బీఆర్ఎస్ అధినేతనే కదా. అంతేనా? టీడీపీ నుంచి బీఆర్ఎస్ లోకి రాగానే ఎమ్మెల్యే టికెట్ తో పాటుగా ఏకంగా మంత్రి పదవి ఇచ్చి? మల్లారెడ్డికి రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యం కల్పించిన నేతగా కేసీఆర్ ఉన్నారు. అలాంటి కేసీఆర్ ను రేవంత్ రెడ్డి ఓ రేంజి విమర్శలు సంధిస్తూ ఉంటే? మాట మాత్రంగా కూడా స్పందించని మల్లారెడ్డి?కనీసం అక్కడి నుంచి



వెళ్లిపోవాలన్న సోయి కూడా లేకుండా కూర్చుని ఉన్నారంటూ బీఆర్ఎస్ నేతలు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా కొనసాగుతూ కేసీఆర్ ను ఆ రేంజిలో విమర్శలు గుప్పిస్తున్న వేదికపై అలా కూర్చుని ఉండిపోయిన మల్లారెడ్డి తీరు చూస్తుంటే? ఆయన గులాబీ పార్టీ నుంచి వేరు పడాలని దాదాపుగా నిర్ణయించుకున్నారన్న సరికొత్త విశ్లేషణలు రేకెత్తిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ అదికారం కోల్పోయిన తర్వాత అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ లోకో, లేదంటే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీలోనో మల్లారెడ్డి చేరిపోయే దిశగా సాగుతున్నారన్న వార్తలు నిత్యం వినిపిస్తూనే ఉన్నాయి. అంతేకాకుండా తనతో ఉప్పునిప్పులా వ్యవహరించిన రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన సమావేశంలో మల్లారెడ్డి అలా స్పందన లేకుండా కూర్చున్నారంటే.. ఆయన బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరిపోవాలని నిర్ణయించుకున్నట్టేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. మరి ఏం జరుగుతుందో చూడాలి.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280